# 99. ప్రయివేటు ఒపినియన్సు

రాఘవరావుతో నా పరిచయం పాతికేళ్లనుంచి. నాగార్జున సాగర్ కాలువల కోసం సర్వేప్లాన్లు ఆమోదించే ఉద్యోగం నాది. కోటేశ్వరరావనే ఆయన ఈ రాఘవరావుని నా దగ్గిరికి తీసుకొచ్చేడు. ఒక వూరి భూమిలోంచి వెళ్తున్న ఒక మేజర్ కాలవ; ఈ రాఘవరావుకి కావలసిన వాళ్లలో ఒకడైన నరసయ్యగారి పొలంలోంచి వెళ్లాలని - ప్లాన్‌లో చూపించేరు. ఆ కాలవ నరసయ్యగారి భూమిలోంచి కాకుండా, పక్కరైతు సుబ్బయ్య గారి భూమిలోంచి వెళ్లే విధంగా, కాలవ ఎలైన్‌మెంటు (దారి) మార్పించాలనే పట్టుదలతో వచ్చాడు రాఘవరావు. కాలవల ఎలైన్‌మెంట్లు నిర్ణయించేది పి.డబ్ల్యు.డి. శాఖవారే గాని రెవెన్యూ శాఖవారు కాదని; నేను రాఘవరావుకి నచ్చజెప్పాను. "మొత్తానికి గవర్నమెంటు ఉద్యోగస్తుణ్ణనిపించుకున్నావు గదయ్యా!" అన్నాడు. "ఏ ప్రాబ్లెం వచ్చినా సరే, చూడంగానే యిది నాది కాదు- అని చెప్పటం గవర్నమెంటు ఉద్యోగస్తులకి వెన్నతో పెట్టిన విద్య." అని సూత్రీకరించేడు; ఈ రాఘవరావు.

"మీరేమిటి చేస్తుంటారు?" అని అతని యోగక్షేమంలోకి ప్రవేశించాను నేను.

"ప్రయివేటు." అన్నాడతను.

ప్రయివేటు - అనగానే అతను నలుగురు కుర్రాళ్లని పోగేసుకుని ఉదయం పూటా సాయంకాలం వేళా ప్రయివేట్లు చెప్పుకుని బతుకున్నాడని అనుకోడానికి నాకు ప్రాణం ఒప్పలేదు.

"దానికేం? ప్రయివేటు కంపెనీ జీతాలు కూడా అంత చచ్చిపోయి లేవు. మా పినతల్లి కొడుకు టాటాలో ఉన్నాడు. గట్టిగా అయిదేళ్ళ సర్వీసుకూడా లేకపోయినా నా జీతానికి మూడు రెట్లు!"

కోటేశ్వరరావు అప్పుడు మా ఇద్దరికీ మధ్య సంధి కలిపేడు. "ప్రయివేట్ అంటే అదొక ఉద్యోగం కాదండీ, వాళ్లవూర్లోనూ, యింకా చుట్టుపక్కల వూళ్లలోనూ ఉండేవాళ్లలో ఎవరికయినా ఏదైనా గవర్నమెంటు ఆఫీసులో చిన్నా పెద్దా పన్లు పడితే ఇతను వాళ్ళ తరపునించి వెళ్లి ఆ పన్లు చేయించుకొస్తాడన్నమాట. ఏ పని జరగడానికి ఏ ఆఫీసుకి వెళ్లాలి - ఎవర్ని ఆశ్రయించాలి- అసలు అప్లికేషను ఎలా రాయాలి - ఎవరెవర్ని ఎలా యెలా పట్టుకోవాలి - ఎంత రేటులో చేతులు తడపాలి - ఇలాంటివి తెలుసుకుని కథ నడిపిస్తాడన్నమాట. "మీరు సలహా ఇస్తే పి.డబ్ల్యు.డి. ఆఫీసులో ఎవర్ని కలవాలో తెలుసుకుని ప్లాన్ మార్పించుకొస్తాడు." అన్నాడు కోటేశ్వరరావు.

"బాగానే వున్నట్టుంది; పెట్టుబడిలేని వ్యాపారం!" అన్నాను కోటేశ్వరరావుతో గుట్టుగా. "లింగంగుంట్లలో పి.డబ్ల్యు.డి. కోలనీ వుంది కదా. అక్కడ వుంటారు ఈ మేజర్ కాలవ ఎలైన్‌మెంటు నిర్ధారణ చేసిన ఎగ్జిక్యూటివు ఇంజనీరు మదన్‌రాజుగారు. కాని, మీరు కోరిన పని చేస్తానని ఓపట్టాన వొప్పుకోడు. ఒప్పుకున్నట్టు మీకు స్ఫురించగానే రేటు పెంచేసుకుంటూ పోతాడు." అని బోధపరిచేను.

రాఘవరావు లేచివెళ్తూ నన్ను వీధి గుమ్మందాకా రమ్మన్నాడు. కోటేశ్వరరావు కూడా లేచాడు గానీ; "మీరుండండి." అని రాఘవరావు అతని బుజం పట్టుకుని కూర్చోబెట్టేశాడు. వీధి గుమ్మందాకా వెళ్లేక ఇరవై రూపాయలు నాకివ్వబోయాడు. "అదేంటది?" అని నేను వెనక్కి తగ్గేను. అతను ఆ రెండు పదిరూపాయల కాగితాలూ నా జేబులో కుక్కేడు. "మీరిచ్చిన ఇన్‌ఫర్మేషనుకి వెలకాదిది. నా స్వల్పబుద్ధికి తోచిన అల్ప సత్కారం." అని చెప్పి, వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

నేను లోపలికి రాగానే కోటేశ్వరరావు అన్నాడు; "పెట్టుబడి లేని వ్యాపారం అని తేలిగ్గా కొట్టి పారేశారు. అది పొరపాటుమాట. ఎక్కడ ఇవ్వవలసింది అక్కడ ఇచ్చుకుంటూ పోవాలి కదా."

"కాని, ఇతను తలపెట్టినది మహాదారుణం. కాలవ సుబ్బయ్యగారి భూమిలోంచివెళ్ళాలి. అంటే సుబ్బయ్యగారి భూమి నష్టమైపోతుంది. నష్టపరిహారం అంటూ మేం ఇచ్చేది చాలా తక్కువ. కాలవ ఎలైనుమెంటు మారితే నరసయ్య గారికి భూమి నష్టం వుండదు; పైగా ఆయన పొలంలోకి నీళ్లు సరఫరా అవుతాయి. ఇతనికి సమాచారం ఇచ్చి నేను సుబ్బయ్యగారికి తీరని ద్రోహం చేశాను.''

తరువాత ఒకసారి నాకు గుంటూరు కలెక్టర్ ఆఫీసులో తగిలాడు రాఘవరావు.

డి-ఫారం పట్టాకింద ఉన్న ఒక భూమిని ఆ పట్టాదారు అమ్ముకోడానికి సంకల్పించాడట. కొనడానికి సిద్ధమైన ఆసామీ ఉత్తరోత్రా రెవెన్యూ శాఖవారు ఖాళీ చెయ్యమని నోటీసు ఇవ్వకుండా ఉండేందుకు చట్టం ప్రకారం కలెక్టరుగారు మాత్రమే సడలించగల ఒకానొక నిబంధన కింద ఆర్డర్ సంపాదించడానికి పదిరోజుల నుంచీ పట్టరాని కాళ్లన్నీ పట్టుకుంటున్నాడట.

"అయినా ఇవన్నీ మీకు కొట్టిన పిండేకదా.'' అన్నాను.

"ఏం పిండో, నేను మాత్రం పిండి అయిపోతున్నాను. ఈ రెవెన్యూ డిపార్టుమెంటూ, మునిసిపల్ ఆఫీసూ ఎలక్ట్రికల్ ఆఫీసూ బ్రేకినస్పెక్టరాఫీసూ ఇవన్నీ యమకూపాలండి. పనిమీద మనం వస్తామా. సరిగ్గా ఆ మనిషే సెలవుపెట్టి వెళ్లిపోతాడు. పోనీ అతగాడు మళ్ళీ డ్యూటీకి వచ్చేక పట్టుకుంటామా. అక్కడితో పని అయిపోదు. సెక్షను హెడ్లు, సూపర్వైజర్ ఆఫీసర్లు, ఆర్డరు వేసే ఆఫీసరు, ఇంతమందిని కట్టుకోవాల్సి వుంటుంది. ఎవరి రేటు వాళ్లకి ఇవ్వడానికి మనం సిద్ధంగానే వస్తాం. కాని ఇదిగో-ఇంత సొమ్ము చెల్లించు; ఇంత టైమ్‌లో ఆర్డర్ ఇస్తాం అనే విధంగా ఒక సిస్టమ్ ఉండదండి. ఆర్డర్ పాసయ్యాక టైపుచేసిన వారూ కవర్లో పెట్టి చేతికి అందించే ప్యూనూ కూడా - తక్కువలోనే పోనిస్తారు గానండీ; తిప్పి చంపుతారండి. ఇదే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అయితేనండి - ఎంత ముచ్చటేస్తుందో! గవర్నమెంట్‌కి చెల్లించవలసిన ఫీజు ఇంత- అని ఒకరేటు ఉంటుంది కదా. దాన్ని అనుసరించి ఆ ఆఫీసులో చెల్లించ వలసింది ఇంత - అని నిర్ధారణగా చెప్పేస్తారు. వసూలు చేసేవారు ఎవరో ఒక్కరే ఉంటారు. వాళ్లలో వాళ్లు ఎవరెవరు ఎంతెంత చొప్పున పంచుకోవాలో దానికి ఒక పద్ధతీ ఒక యంత్రాంగం ఉంటాయండి. డబ్బు పుచ్చుకోకుండా ఎవ్వరూ ఆర్డరు చేతికి ఇవ్వరండి. ఆ మాత్రం దానికి మనల్ని తిప్పి చంపకుండా ఒక సిస్టమ్ ఏర్పాటు చేసుకుంటేనేమండి?''

కిందటేడు నేను ఢిల్లీ వెళ్లినప్పుడు పరిశ్రమల శాఖలో ఉన్న ఒక మిత్రుడిని పలకరించడానికి బయలుదేరాను. ఆశ్చర్యం! రాఘవరావు ఒక టాక్సీలో వెళ్తూ, నన్ను చూసి, గుర్తు పట్టి; టాక్సీలో తనతోబాటు తీసికెళ్లాడు. "మీ ప్రజాసేవ ఢిల్లీ దాకా విస్తరించిందే!'' అన్నాను. "ప్రజాసేవా, పాడా? బిజినెస్ అనండి; నేనేం బాధపడను'' అన్నాడు.

ట్రాఫిక్ జంక్షన్‌లో ఎర్రలైటు వచ్చినందువల్ల టాక్సీ ఆగింది. రాఘవరావు అక్కడ రోడ్డుకి ఎడం పక్కగా ఉన్న ఒక బోర్డుమీద ఉన్నది చదివి; "ఎలాగైనా ఢిల్లీ హైద్రాబాద్ కంటే చవకేనండి'' అన్నాడు.

"చవకా?'' అని ఆశ్చర్యపడ్డాను.

"చూడండి.'' అని ఆ బోర్డు నాచేత చదివించేడు. "ఎర్రలైటు వెలిగి వున్నప్పుడు ఈ గీత దాటి వెళ్లిన వాహనదారుకి యాభైరూపాయలు జరిమానా విధించబడును!'' అని చదివేను.

"మన హైదరాబాదులో ఇదే అఫెన్సుకి ఫైను డెబ్భయ్యయిదు రూపాయలు; తెల్సా?'' అన్నాడు రాఘవరావు.

★